క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



ఊట్కూరు: హైదరాబాద్‌లో ఇటీవల ఐకాన్ అవార్డు అందుకున్న ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రిషికుమార్‌ను శనివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శాలువాతో సన్మానించారు. మంజునాథ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని నిడుగుర్తి గ్రామానికి చెందిన రిషికుమార్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డును ప్రధానోత్సవం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వారిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా క్షేత్రంలో ఉంటూ ఎన్నో మంచిసేవా కార్యక్రమాలు చేపట్టి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకు రావాలని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కారంపాడి శ్రీనివాస్, కావలి కాయప్ప, నాగేశ్వర్‌రావు, రాకేష్, కిరణ్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బస్సులు ఆపాలి

మరికల్: రోడ్లపై మహిళ ప్రయాణికులు కన్పిస్తే చాలు బస్సులు ఆపడం లేదని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు కొండయ్య, నర్సింహులు అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మహిళల కోసం ఉచిత బస్సుసౌకర్యం కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి గౌరవం ఇవ్వడం లేదన్నారు. బస్టాండ్‌లో తప్ప ఎక్కడైన మహిళలు రోడ్లపై, స్టేజీల వద్ద ఎదురుగా వస్తున్న బస్సులను ఆపే ప్రయత్నం చేసిన ఆపకుండా వెళ్లిపోతున్నారని ఆరోపించారు. బస్సులు ఆపకపోవడంతో రాత్రి సమయంలో స్టేజీల వద్ద ఇతర గ్రామాల నుంచి సొంత గ్రామాలకు వెళ్లే మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మంత్రాలయానికి పాదయాత్రగా యువకులు



నారాయణపేట రూరల్ : పట్టణానికి చెందిన పలువురు యువకులు పాదయాత్రగా మంత్రాలయ క్షేత్రానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం పరిమళాపురంలోని శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో విద్వాన్ అనిల్ దేశాయ్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, అంబేడ్కర్ సర్కిల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకులు కురుమన్న జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ వ్యక్తికి గురు ఆశీర్వాదం ఉంటే మంచి జరుగుతుందని, యువత లోక కల్యాణార్థం పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. రవికుమార్‌గౌడ్, అయ్యప్ప, కన్నరవి, మల్లేష్, అక్షయ్, జగదీష్, కార్తికేయ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాగనూర్: మరమ్మతుల కారణంగా మండల వ్యాప్తంగా ఈ నెల 26 ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దేవేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, వ్యాపారస్తులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీవీపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు భూషణ్‌పాండే అన్నారు. జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో శనివారం బీవీపీ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరంలో గతంలో కంటే ఎక్కువస్థాయిలో బీవీపీలో సభ్యత్వ నమోదు చేయాలని కోరారు.

ఉపాధిహామీని నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తాం

ఆత్మకూర్: ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌రాజు, కార్యదర్శి ఆంజనేయులు విమర్శించారు. శనివారం పట్టణంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం పథకానికి బడ్జెట్లో నిధుల కేటాయింపును కుదిస్తు వస్తున్నారని, పథకాన్ని ఎత్తివేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు ఇవ్వాలని, 200 రోజుల పని కల్పించాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అజయ్, దేవన్న, నాయకులు, ఉపాధి కూలీలు ఉన్నారు.



జీలుగ సాగుతో మేలు

- భూసారం పెంచే జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలు సిద్ధం
- అవగాహన లేక రసాయనిక ఎరువుల వినియోగం
- సంప్రదాయ ఎరువుల వాడకంతో భూసారం పెరిగే అవకాశం
- సబ్సిడీ ధరలకే లభిస్తున్న విత్తనాలు



జీలుగ పంట (ఫైల్)

మద్దూరు: కొద్ది రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే రైతులు దుక్కులు దున్నడంలో నిమగ్నమయ్యారు. భూ సాంద్రత, వాటిలోని పోషకాలను పెంచడంకోసం గతంలో రైతులు పశువుల ఎరువును సంప్రదాయ ఎరువులుగా పొలాల్లో వేసి కలియదున్నేవారు. ప్రస్తుతం సంప్రదాయ ఎరువుల స్థానంలో రసాయన ఎరువులు ఉపయోగం ఎక్కువ అవుతుంది. దీంతో వ్యవసాయ భూములు వాటి సహజ లక్షణాలు కోల్పోయి, భూమిలోని సూక్ష్మపోషకాలు చనిపోతున్నాయి. సారం కోల్పోయిన భూముల్లో మంచి దిగుబడి వచ్చేలా చేయాలంటే సంప్రదాయ ఎరువులైన జీలుగ, పచ్చిరొట్ట వంటి వాటిని పంటకు ముందు భూములలో పెంచితే భూసారం పెరిగే అవకాసం ఉంది.

జీలుగు సాగుపై సూచనలు..

ఏకవార్షిక మొక్కల్లో ప్రథమ స్థానం జీలుగదే, మొక్కలు నాటిన 25 నుంచి 30 రోజుల్లోనే పంట ఏపుగా పెరుగుతుంది. ఎకరానికి 10నుంచి 12కిలోల విత్తనాలను సిద్ధం చేసుకోవాలి. దుక్కిలో 20 నుంచి 30 కిలోల యూరియా వేసి అపై విత్తనాలను చల్లుకోవాలి. బిందుసేద్యం ద్వారా అయితే సాళ్లలో విత్తుకోవాలి. మొక్కలు బాగా పెరిగేందుకు క్రమపద్ధతిలో తడులివ్వాలి. 25 నుంచి 30 రోజులకు మొక్క ఏపుగా పెరిగి పూతదశకు చేరుకుంటుంది. ఆ సమయంలో మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలి లేదా రోటోవేటర్ సహాయంతో కలియదున్నాలి. దునినన అనంతరం 100 కిలోల సిగింల్ సూపర్ పాస్ఫేట్‌ను దుక్కిలో వేయాలి. సూపర్ పాస్ఫేటు వల్ల మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్ట ఎరువులు తయారవుతాయి. కుళ్లేదశలో నీటిని సక్రమంగా అందివ్వాలి.

లాభాలెన్నో..

- పొలంలో జీలుగను కలియదున్నిన తర్వాత అవి పంటలకు విశేషమైన లాభాలు అందిస్తుంది.
- ప్రధాన పంటకు ముందస్తుగా నేలను తయారు చేస్తుంది.
- జీలుగ సాగుతో మూడు టన్నుల పచ్చిరొట్ట ఎరువులు లభిస్తాయి.
- మొక్కలకు 2 శాతం నత్రజని, సూపర్ ఫాస్పేట్‌ను అధనంగా అందిస్తాయి.
- జింక్, మాంగనీష్, ఇనుము, కాల్షియం, వంటి సూక్ష్మదాతువులను పంటకు చేకూర్చుతాయి.
- నేలతో కరగని మూలకాలనూ పంటకు అనుకూలంగా మార్చుతాయి.
- నీటి నిల్వ సామర్థ్యం పెంచుతాయి.
- నేల సహాజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయి.
- లెగ్యూ జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది.
- తుంగ, గెరిక వంటి కలుపు మొక్కలను అడ్డుకుంటుంది.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు



మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 30కేజీల బస్తా ఒక్కటి రూ. 2,700 కాగా సబ్సిడీ రూ.1,674 పోను అమ్మకపు ధర రూ.1,116. అవసరమైన రైతులు పట్టదారు పాస్‌బుక్కు, అధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలి.

– రామకృష్ణ, వ్యవసాయాధికారి, మద్దూరు

విత్తనాల కొనుగోలుపై అవగాహన



నేరడగంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సుదర్శన్‌గౌడ్

మాగనూర్: పంటల సాగుకు విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఇన్‌చార్జి ఏఓ సుదర్శన్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నేరడగంలో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడారు.. ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన డీలర్ వద్ద మాత్రమే ధృవీకరించడిన విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని ఏఓ సూచించారు. విత్తనాల ప్యాకెట్‌పై కంపెనీ, ఉత్పత్తి తేదీ, ధర తదితర విషయాలను నిర్ధారించుకోవాలని చెప్పారు. లూజుగా ఉన్న సంచుల్లో ఉన్న విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోను కొనొద్దని సూచించారు. విత్తనాల కొనుగోలుకు సంబంధించి డీలర్ వద్ద తప్పనిసరిగా రసీదులు పొంది పంట పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని చెప్పారు. నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే అందుకు సంబంధించిన సమాచారం ఇచ్చి రైతులు సహకరించాలని కోరారు.

మరికల్: మండలంలోని శనివారం మండల వ్యవసాయ శాఖ అధికారులు శివకుమార్, పరుశురాం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల్లో రాత్రికి రాత్రి వచ్చి విక్రయించే నకిలీ వ్యాపారుల నుంచి పత్తి విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. అలాగే బీజీ–3 పేరుతో చలామణి అవుతున్న హెచ్‌టీ పత్తి విత్తనాలకు జీఈఏసీ అనుమతి లేనందున ఈ రకం విత్తనాలను అమ్మడం, కొనడం నేరమన్నారు. విత్తనాలు కొనుగోళ్లు చేసి దుకాణం నుంచి రైతులు తప్పకుండా రసీదును తీసుకోవాలని తెలిపారు. రైతులకు సరిపడే విత్తనాలను ఫర్టిలైజర్ దుకాణాదారులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డిలో శనివారం ఏఈఓ మానస ఆధ్వర్యంలో రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విత్తన కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పకుండా రసీదులు తీసుకోవాలని సూచించారు. రైతులకు సందేహాలు ఉంటే మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఇందులో గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



మరికల్‌లో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఏఓ శివకుమార్



మురహర్‌దొడ్డిలో ..

గొర్రెల కాపరుల డీడీలు రెట్టింపు చేసి ఇవ్వాలి

ఊట్కూరు: ప్రభుత్వం తిరిగి గొర్రెల కాపరులకు ఇస్తున్న డీడీలను రెట్టింపు చేసి ఇవ్వాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రఘువీర్‌యాదవ్ కోరారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం గొర్రెల కాపరులు సబ్సిడీ గొర్రెల యూనిట్లకోసం 42వేల రూపాయల డీడీలను ప్రభుత్వానికి ఇచ్చిందని, కాని ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలు ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి 42 వేల రూపాయలు తిరిగి ఇవ్వడం సోచనీయమన్నారు. గత ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు సబ్సిడీపై లక్షలాది రూపాయలు ఇవ్వడం జరిగిందని, అదే గొర్రెల కాపరుల విషయంలో మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం గొర్రెల కాపరుల డబ్బులను తీసుకొని వారిని మోసం చేస్తే అదే మోసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాపరుల డీడీల మొత్తాన్ని రెట్టింపు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గోపాల్ యాదవ్, చర్లప్పయాదవ్, వెంకటయ్యయాదవ్, దివాకర్‌యాదవ్, ఉశప్పయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



మద్దూరు: మండలంలోని లింగల్‌చేడ్, ఎక్కమేడ్ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ జయరాములు శనివారం పరిశీలించారు. అధికారులు సూచించిన మేరకు కొలతల ప్రకారం పనులు చేస్తే రోజూ కూలీ అధికంగా వస్తుందని కూలీలకు సూచించారు. అవసరమైన మేర కూలీలకు పనులు గుర్తించాలని ఏపీఓ సిద్దేశ్వర్‌కు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని నర్సరీలను పరిశీలించారు.

ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక దాడులు



గిరిజనులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ సీఐ

నారాయణపేట రూరల్ : మండలంలోని బోయిన్‌పల్లితండా పంచాయతీలో శనివారం ఉదయం స్థానిక ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఈసందర్భంగా తండా మొత్తం పూర్తిగా జల్లెడ పట్టారు. ఎక్కడ సైతం సారా దొరకలేదు. అనంతరం ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులను సమావేశపర్చారు. నాటుసారా కాయడంతో కలిగే నష్టాలు, చట్ట ప్రకారం శిక్షలను తెలియజేశారు. గిరిజనులతో నాటుసారా ఆపివేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

జింకను కాపాడిన యువకులు



నర్వ: మండలంలోని రాయికోడ్, నర్వ గ్రామా ల మధ్యన పొలాల వద్ద పరిగెడుతున్న జింకను వెంటాడి గాయపర్చిన కుక్కలను తరిమి జింకను యువకులు కాపాడారు. శనివారం నర్వకు వస్తున్న రాయికోడ్ గ్రామానికి చెందిన శంకర్ బైక్‌పై నర్వకు వస్తుండగా చెరువు సమీపంలో కుక్కల దాడిలో గాయపడ్డ జింకను చూసి కుక్కలను తరమి జింకను నర్వ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు అరవింద్ జింకకు ప్రాథమిక చికిత్స నిర్వహించి అనంతరం అటవీశాఖ అధికారులకు జింకను అప్పగించారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



మక్తల్‌లో క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న గోపాలం

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నెల రోజుల పాటు నిర్వహిస్తున్న నెట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొంటున్న 50 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను శనివారం పంపిణీ చేశారు. ఇందులో ముఖ్య అతిథులుగా నెట్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ ఆదిత్యరెడ్డి, కో–శాధికారి సోహెల్ పాల్గొన్నారు. క్రీడా కారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీడాలో రాణించి దేశానికి పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ వెంకటేష్, హెచ్‌ఎం రమేష్‌శెట్టి, దాతలు ప్రవీణ్‌రెడ్డి, మండల కోచ్ అధ్యక్షుడు గోవర్దన్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని కర్ని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏకలవ్య స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు విశ్రాంత పీఈటీ గోపాలం చేతుల మీదుగా శనివారం దుస్తులు పంపిణీ చేశారు. శిక్షణ శిబిరంలో దాదాపు 80మంది విద్యార్థులు ఖోఖో ఉచిత వేసవి క్రీడాశిబిరంలో శిక్షణ పొందుతున్న వారికి గోపాలం తన సొంత ఖర్చులతో దుస్తులు అందజేశారు. అనంతరం పాఠశాలకు చెందిన పీఈటీ రూప ఎన్‌ఐఎస్‌లో జాతీయ స్థాయిలో క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇవ్వడంపై ఆమెను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ రూప, కార్యదర్శి దీప, డి.రాము, రమేష్, అంబ్రేష్, అనిత పాల్గొన్నారు.



ధన్వాడలో..

మహిళా సమాఖ్య సభ్యులు సద్వినియోగం చేసుకోండి

నర్వ: మహిళా సమాఖ్య సంఘాలకు పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టుటకు ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిన నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని 23 పాఠశాలలు, కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్‌ను కుట్టుటకు మహిళా సంఘాల సభ్యులు ముందుకు రావాలన్నారు. ఇప్పటి వరకు 3760 యూనిఫామ్స్ లక్ష్యంగా ప్రారంభం కాగా ఇప్పటి వరకు 633జతల యూనిఫామ్స్‌ను కుట్టడం జరిగిందన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఇప్పటివరకు 15 సంఘాల సభ్యులు తమ కుట్టుమిషన్‌లతో వచ్చి యూనిఫామ్స్ కుట్టే పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నారన్నారు. కుట్టు పనులు చేపట్టే సభ్యులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పారితోషికం అందిస్తామన్నారు. జూన్ 5 వరకు లక్ష్యాన్ని చేరుకునేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8790990595నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కొత్త ఎంపీటీసీ స్థానం కోసం వినతి

అమరచింత: మండలంలోని కిష్టంపల్లి, చంద్రగడ్, నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామాలను కలిపి కొత్తగా ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శనివారం ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందించారు. గతంలో సింగంపేట, మస్తీపురం, కిష్టంపల్లి, చంద్రగడ్, నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామాలను కలిపి ఎంపీటీసీ స్థానంగా కొనసాగేదని, ప్రస్తుతం జనాభ పెరిగిందని దీంతో సింగంపేట గ్రామం తమ గ్రామాలకు దూరంగా ఉందని వీటిని తొలగిస్తు తమ గ్రామాలను కలిపి కొత్తగా ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త స్థానం ఏర్పాటుతో ప్రజాపాలనకు అన్ని విధాలుగా బాగుంటుందన్నారు.

వీధి కుక్కలతో స్థానికుల ఇక్కట్లు



మటన్ మార్కెట్ రోడ్డులో వీధికుక్కలు

అమరచింత: పట్టణంలోని పాత కల్లుగేరి, మటన్ మార్కెట్ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతుంది. పాత మార్కెట్ ప్రాంతంలోనే కురగాయలు, చేపలు, మాంసం దొరుకుతుండటంతో పట్టణంలోని ప్రజలు అధిక సంఖ్యలో ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కుక్కలతో పాటు పందుల మందసైతం ఇక్కడే ఉండటంతో ప్రజలు తినుబండరాలు, మాంసం, కూరగాయలు తీసుకెళ్తున్న సమయంలో వారిపై దాడిచేసి వాటిని లాక్కుతినే పరిస్థితులు దాపురించాయి. పందులను నివారించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నవించడంతో వీటిని పట్టణం నుంచి తరలించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం కుక్కలు సైతం మనుషులపై దాడి చేస్తున్నాయి. పట్టణంలోని బస్టాండ్ రహదారితో పాటు అన్ని వార్డులలో కుక్కలు అధికంగా సంచరిస్తున్న మున్సిపల్ అధికారులు, పశువైద్యాధికారులు వాటిని నియంత్రించలేక పోతున్నారు.

అధికారుల్లో చలనం శూన్యం..

అన్ని మున్సిపాలిటీలలో వీధికుక్కలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నా.. స్థానిక మున్సిపాలిటీలో మాత్రం వాటిని అరికట్టేందుకు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేకపోతున్నారు. వనపర్తి, ఆత్మకూర్ మున్సిపాలిటీలలో కుక్కల నివారణకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.

అండర్‌పాస్ నిర్మాణమెప్పుడో?

- వెంకటగిరి వద్ద పనులు ప్రారంభించకుండానే రైల్వేగేట్‌మూసివేత
- రెండునెలలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రోడ్డును తవ్వి ఇనుప పట్టాలు అడ్డువేయడంతో మూతపడ్డ వెంకటగిరి రైల్వేగేట్

దేవరకద్ర: కౌకుంట్ల మండలం కురుమూర్తి స్టేషన్ సమీపంలోని వెంకటగిరి రైల్వే గేట్‌ను అధికారులు మూసివేయించడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గేట్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం కోసం అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే కనీసం అండర్‌పాస్ పనులు కూడా ప్రారంభం కాకముందే రెండు నెలల క్రితమే గేట్‌ను మూసివేసి...రోడ్డును తవ్వి వదిలివేశారు. తాత్కాలికంగా గేటు నుంచి వెంకటగిరి గ్రామం మీదుగా మట్టి రోడ్డు వేసి అమ్మాపూర్ రోడ్డుకు కలిపారు. అయితే ఈ మట్టి రోడ్డు సరిగ్గా లేక పోవడం గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో.. ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహన దారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కాగా ప్రసిద్ధి చెందిన కురుమూర్తి ఆలయంనకు, దేవరకద్ర నుంచి ఆత్మకూర్, కొత్తకోట పట్టణాలకు ఇదే దారి ఉంది. ఇలాంటి దారిని రెండు నెలల నుంచి మూసివేయడం కనీసం పనులు కూడ ప్రారంభించకపోవడంపై ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభం అయి అండర్ పాస్ పూర్తి అయ్యే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాపోతున్నారు. పనులు త్వరగా ప్రారంభించి అండర్‌పాస్ పూర్తి చేయాలని.. ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు



మూలమళ్లలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదాల బారిన ప్రజలు, మూగజీవాలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

ఆత్మకూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు చుట్టూ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయనే భయంతో ఆయా కాలనీవాసులు ఆందోళనకు చెందుతున్నారు. ఆత్మకూర్ పట్టణంలోనే పరిస్థితి చక్కబెట్టని అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే మండలంలోని పిన్నంచర్ల, బాలకిష్టాపూర్, ఖానాపూర్, గుంటిపల్లి, తిప్పడంపల్లి, జూరాల, మోట్లంపల్లి, మేడేపల్లి, రేచింతల, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూర్, మూలమళ్ల గ్రామాల్లో ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన 54 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు నేటికీ కంచెను ఏర్పాటు చేయలేకపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రత లేకపోవడం వల్ల మూగజీవాలు విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. అయినా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏర్పాటు చేయాలి..



ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇది వరకే పలుమార్లు ఈవిషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయింది. వర్షాకాలంలో మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి.

– మోష, మూలమళ్ల

బడ్జెట్ రావడం లేదు..



ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేని కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విషయాన్ని ఉన్నతాధికారులకు గతంలోనే నివేదించాం. నిధులు రాకపోవడంతో గ్రామాల్లో సర్పంచ్‌ల ద్వారా, మున్సిపాలిటీలో పాలకమండలి ద్వారా కంచెలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఇదివరకు ఆత్మకూర్ పట్టణంలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేశారు. నిధులు విడుదల అయిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తాం.

– నర్సింహులు, ట్రాన్స్‌కో ఏఈ, ఆత్మకూర్



కత్తేపల్లిలో..



గుంటిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందిన పశువు(ఫైల్)



పిన్నంచర్లలో..